# సూర్య
17 వ వసంతంలోకి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం | 17 జులై 2024 | పేజీలు 8


## జనసేన సిటీ, డివిజన్ నాయకులతో కోర్ కమిటీ సమావేశం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి నెల్లూరు జిల్లా పర్యవేక్షకులు వేములపాటిట అజయ్, అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ సూచనలతో 15 మందితో ఏర్పాటు చేసిన కోర్ కమిటీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ సిటీ, డివిజన్ నాయకులతో గోమతి నగర్‌లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశం జరిగింది. కోర్ కమిటీ సభ్యులు, డివిజన్ నాయకుల పరిచయ కార్యక్రమం, భవిష్యత్ కార్యాచరణ గురించి మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యాలయం ఇంచార్జ్ జమీర్, కోర్ కమిటీ సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, రవి, నాగరత్నం యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, శ్యామ్, చదలవాడ రాజేష్, శ్రీరామ్, శ్రీపతి రాము, సిటీ, డివిజన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి దుకాణంలో చెలరేగిన మంటలు



**దగదర్తి, మేజర్‌న్యూస్ :** దగదర్తి మండలం ఉలవపాళ్ళ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఓ వ్యాపార దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దుకాణ వ్యాపారి సోమవారం రాత్రి 9 గంటలకు వ్యాపారం ముగించుకొని ఇంటికి వెళ్లినట్లు బాధితుడు కోవూరు రవీంద్రబాబు తెలిపారు. దుకాణం నుండి మంటలు ఎగసిపడటంతో స్థానికులు గమనించి యజమానులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న యజమానులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు విచారణ చేపడతామని తెలిపారు.



- అనుమతుల్లేకుండా.. మెట్టల్లో

# మట్టి మాఫియా



### అధికారపార్టీ నేతల అండదండలు - అక్రమంగా మట్టి తరలింపు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పెద్ద చెరువు నుంచి మంగళవారం కొంతమంది ఇటుక బట్టీ నిర్వాహకులు ఎక్స్కవేటర్ సహాయంతో సుమారు పది ట్రాక్టర్లతో ఎలాంటి అనుమతుల్లేకుండా మట్టి తరలించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సహజ సంపదల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసింది. అయితే ఉదయగిరి ప్రాంతంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. సెలవు దినాలు, అధికారులు రాని సమయాన్ని అదునుగా చూసుకొని జోరుగా అక్రమ మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉదయగిరి పెద్ద, చిన్న చెరువుల్లో ఇష్టానుసారంగా మట్టి తరలిస్తుండడంతో పెద్ద పెద్ద గోతులుగా మారి ప్రమాదకరంగా మారాయి. ప్రభుత్వం ఓవైపు హెచ్చరికలు చేస్తున్నా మట్టి మాఫియా వారి హెచ్చరికలను భేఖాతరు చేస్తూ యదేచ్ఛగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇందులో అధికార పార్టీ నాయకుల హస్తం ఉండడంతో ఇటుకబట్టీల నిర్వాహకులు తమకేమీ కాదనే ధీమాతో చెరువు మట్టిని తరలిస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా మట్టిని తరలిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. చెరువుల నుంచి మట్టి ఆక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు మౌనం వహించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. చెరువులో మట్టి తరలిస్తున్న విషయం తెలుస కొన్న అధికారులు వాహనాలను అడ్డగించి నిలిపివేశారు.

### వాహనాలను సీజ్ చేస్తాం :
**జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి**

అనుమతుల్లేకుండా చెరువుల్లో మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు ఎక్స్కవేటర్, ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. ఇప్పటికే వాహనదారులను పలుమార్లు హెచ్చరించాం. వారిలో మార్పు రావడం లేదు. త్వరలో వాహనదారులతో సమావేశం ఏర్పాటు చేసి ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

## ఎస్పీని కలిసిన బిజెపి మహిళా నేతలు



**నెల్లూరు, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి మంగళవారం నెల్లూరు జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. మహిళా భద్రతకు చర్యలు చేపట్టాలని, అదేవిధంగా విద్యార్థులను గట్టి భద్రత చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా ఎస్పీని కోరారు. అనంతరం ప్రధానమంత్రి ఫోటోను జిల్లా ఎస్పీకి అందజేశారు. కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గంట విజయశ్రీ, సుజాత, కుమారి, మౌనిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్ నగరాలతో సమానంగా
## టిడ్కో నివాస ప్రాంతాలు రూపు దిద్దుతాం



2లో టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కావ్య

## రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు పూర్తి

దర్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ మధులత



వివరాలు 3లో

### రొట్టెల పండుగకు.. 2 వేల మంది పోలీసులతో

# పటిష్ట బందోబస్తు



- డ్రోన్, 52 సీసీ కెమెరాలతో నిఘా
- విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు
- జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్

**నెల్లూరుక్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని బారా షాహిద్ దర్గాలో 5 రోజుల పాటు నిర్వహించే రొట్టెల పండుగకు 2 వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. మంగళవారం పోలీస్ కవాతు మైదానంలో రొట్టెల పండుగ సంబంధించి బందోబస్తు ఏర్పాట్లపై ఆయన సమీక్షించి వారు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నుండి రొట్టెల పండగ ప్రారంభం అవుతుందని, దేశ విదేశాల నుండి భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో తమ సిబ్బంది భక్తులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మెయిన్ దర్గా, ఘాట్ ఏరియా, ట్రాఫిక్, పార్కింగ్ ఏరియాలను సెక్టార్లుగా విభజించి పలు సూచనలు చేశారు. 5 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలలో

మిగతా 02లో

## ఘనంగా వీర అభయ ఆంజనేయస్వామి వేడుకలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని మారుతి నగర్‌లో కొలువై ఉన్న శ్రీ వీర అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో 7వ మంగళవారం కమ్మ జనసేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనాయుడు హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యనిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కమ్మ జనసేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## మంత్రిని కలిసిన వేమిరెడ్డి దంపతులు

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డిని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలోని మంత్రి ఛాంబర్ కు వచ్చిన వేమిరెడ్డి దంపతులు ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు. వివిధ అంశాలపై వారు మంత్రితో చర్చించారు.

# కావలి ముసునూరు రోడ్డుకు మోక్షం

## సంతోషంలో ప్రజలు.. ఎమ్మెల్యే కావ్యకు కృతజ్ఞతలు



**కావలి, మేజర్‌న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వంలో కావలి నియోజకవర్గం అభివృద్ధిలో ఎన్నో ఏళ్లుగా వెనుకబడిపోయినట్టు మనం చూస్తున్నాం. కావలి నియోజకవర్గం ప్రజలు అభివృద్ధి చేయగల సత్తా సామర్థ్యం ఉన్న వ్యక్తి కావ్య కృష్ణారెడ్డి అని కావలి నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టారు. అయితే గత వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కావలి నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి ఎంతో అధ్వానంగా ఉండడం మనం చూశాం. కనీసం రోడ్లు అధ్వానంగా ఉన్నప్పటికీ కనీసం ఒక ట్రక్కు మట్టి కానీ, గ్రావెల్ కానీ వేసిన దాఖలాలు లేవు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ గృహం ఎదురుగా, ముసునూరు రోడ్‌లో ఎంత అధ్వాన పరిస్థితి తయారైందో నిత్యం వాహన చోదకులు, ఆర్టీసీ యాజమాన్యం, ఆటోవారు తిట్టుకోని రోజులేదు. అలాంటి పరిస్థితి నుంచి ప్రస్తుత టీడీపీ అధికారంలోకి తీసుకువచ్చిన ప్రజలు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. గెలిచిన అనతికాలంలోనే రోడ్లు, ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ముసునూరు మాజీ ఎమ్మెల్యే ఇంటి ముందు నూతనంగా వేసిన రోడ్లు చూస్తే.. నరకం నుంచి స్వర్గంలోకి పడ్డనట్లయిందని ప్రజలు హర్షిస్తున్నారు. అంతేకాకుండా ఆటో యజమానులు, ప్రజలు నిరంతరం ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, కావలికి ఇలాంటి ఎమ్మెల్యే కావాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుకోవడం, పట్టణంలో ఈ వార్త సంచలనం కలిగిస్తున్న విశేషం.

# కార్పొరేట్ నగరాలతో సమానంగా టిడ్కో నివాస ప్రాంతాలు రూపు దిద్దుతాం

## టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి మద్దూరుపాడలో టీడీపీ హయంలో నిర్మించిన టిడ్కో గృహాలను కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో టిడ్కో లబ్ధిదారులతో వారు మాట్లాడారు. ప్రతి గృహాన్ని పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న పార్కు, నీటి ట్యాంకు, రోడ్లు, డ్రైనేజీలను క్షుణ్ణంగా పరిశీలించి అనంతరం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం అధికారులు పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నారని, ఈ ప్రాంతంలో పనులు త్వరితగతిన పూర్తి చేయిస్తామని తెలిపారు. ఇలా ఆవరణంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఇకపై పుష్కలంగా నీరు, నెలలోపు కరెంటు సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పాములు సంచారం లేకుండా ఆవరణ పరిశుభ్రంగా ఉంచుతామని, పార్కులలో మొక్కలు నాటుకొని సంరక్షించాలని, ఆర్గానిక్ కూరగాయలను పండించుకోవచ్చని, పార్కును కూడా పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని తెలిపారు. టిడ్కో యజమానులు ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందరికీ ఓటర్‌కార్డులు, రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు, టిట్కో ప్రాంతానికే మార్చుకోవాలన్నారు. రేషన్ మీ ప్రాంతంలోనే తీసుకోవచ్చని, ఓట్లన్నీ ఒకేచోట ఉంటే నాయకులతో అభివృద్ధి పనులు చేయించుకోవచ్చని తెలిపారు. కావలి పట్టణానికి అమృత్ పథకం ద్వారా రావాల్సిన నీటిని ఐదేళ్లుగా రానీయకుండా, ప్రజల దాహార్తిని తీర్చని కావలి కాలకేయుడు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అని విమర్శించారు. అభివృద్ధి చేసే చంద్రబాబు ప్రజలకు అండగా ఉన్నారని, ఒక సంవత్సరం లోపు అమృత్ పథకం ద్వారా నీటిని కావలి ప్రజలకు అందజేస్తామని తెలిపారు. గృహ యజమానులు అందరూ ఇళ్లల్లో చేరాలని, ఇళ్లలో చేరిన వారికి ప్రభుత్వం ఏదైనా లబ్ధి చేకూరవచ్చని, అది వృధా కాకుండా ఉండడం కోసం తప్పక లబ్ధిదారులు చేరవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సాంకేతిక కారణాలతో లోన్లు రానివారికి వచ్చేలా కృషి చేస్తానని, మంజూరుకు తమవంతు కృషి చేస్తామన్నారు. అందరి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, నిరంతరం ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని తెలిపారు. టిట్కో ఆవరణంలో ఎలాంటి సమస్య వచ్చినా.. పార్టీ తరపున పరిష్కరించడానికి కావలి పట్టణ టీడీపీ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబును ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీకే శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రవణ్‌కుమార్, విద్యుత్ శాఖ ఈ.ఉమాశంకర్ శాస్త్రి, టీడీపీ పట్టణ నాయకులు కిషోర్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, లీగల్ సెల్ నాయకులు గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు బేగం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్ కుమార్ యాదవ్, జనసేన నాయకులు సాయి విట్టల్, కొండ వెంకట్రావు, కొమర వెంకటేశ్వర్లు, మురళి యానాది, టీడీపీ బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెరువు తూములను మరమ్మత్తులు చేయిస్తాం

### ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వర్లు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం చెరువు 1 నెంబర్ తూముకు త్వరలో మరమ్మత్తులు చేపడతామని ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం అనంతసాగర చెరువును ఆయన పరిశీలించారు. తూము షెటర్లు మరమ్మత్తులకు గురి కావడంతో చెరువు నుంచి పంట పొలాలకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని ఆయకట్టు రైతులు గతంలో మంత్రి ఆనం దృష్టికి తీసుకువెళ్లి ఉన్నారు. మంత్రి ఆదేశాలతో ఆ శాఖ అధికారులు చెరువును సందర్శించడం జరిగింది. త్వరలో పనులు చేపడతామని రైతాంగం ఆవేదన చెందా రాదని అధికారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ లీలాకుమారి, జేఈ ఖాదర్, రైతులు పాల్గొన్నారు.

## గ్రామదేవతైన పోలేరమ్మకు భక్తిశ్రద్ధలతో పొంగళ్ళు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోనే ఆల్తుర్తి గ్రామంలో గ్రామదేవత పోలేరమ్మ తల్లికి పొంగళ్ల కార్యక్రమాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పోలేరమ్మ ఆలయంలో మహిళలు పాల పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో పల్లె సీమలు విరాజిల్లాలని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఈ వేడుకలకు విచ్చేసిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ ప్రదీప్ యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు పాపిరెడ్డి, హజరత్ యాదవ్, దయాకర్ రెడ్డి, సుబ్బారావు, దశయ్య గౌడ్ పాల్గొన్నారు.

## పంచాయతీ అక్రమాలపై విచారణ చేయండి

### సర్పంచ్ బూదురు లక్ష్మీ డిమాండ్



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు గ్రామ పంచాయతీలో జరిగిన రూ.కోట్ల కుంభకోణాలపై ప్రభుత్వ అధికారులు వెంటనే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుని సంబంధిత అధికారుల నుండి రికవరీ చేయాలని స్థానిక సర్పంచ్ బూదురు లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తనకు తెలియకుండానే అవకతవకలు జరిగాయన్నారు. చాలా ఇబ్బందులు పడినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి విచారణ చేయాలని కోరారు. సమావేశంలో వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి నివారణ సామాజిక బాధ్యత




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండల పరిధిలోని సౌత్ మోపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు పి.రవీంద్రనాథ్ రెడ్డి, షైక్ అర్షద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈనెల 18వ తేదీ నుండి ఆగస్టు 2 తేదీ వరకు ఆశావర్కర్లు ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తూ.. సర్వే నిర్వహించాలని సూచించారు. మైకో బాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వలన ఈ వ్యాధి వస్తుందని, శరీరంలో కొన్ని కొన్ని మార్పులు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్‌అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంమైన గుండ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈవో మల్లికార్జున మాట్లాడుతూ.. ప్రాథమిక సంఘం పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో రైతులకు రుణాలు ఇప్పించడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర కల్పించడం జరుగుతుందన్నారు. సహకార రంగంలో గుండ్లపాలెం పీఏసీఎస్ అభివృద్ధి దిశగా చేసేందుకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టండి..



**బోగోలు, మేజర్‌న్యూస్ :** మండలంలోని విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలో గల కొత్తూరు గ్రామంలో పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంక్ మోటారు మొరాయించటంతో గత కొంతకాలంగా నీటి సరఫరా కొరత ఏర్పడింది. గ్రామంలోని పైలెట్ ప్రాజెక్టు వాటర్‌ట్యాంక్ అనేకసార్లు మరమ్మతులకు గురవుతుందని, అలాంటి సమయాలలో ఈ వాటర్ ట్యాంక్‌ను ఉపయోగిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ పరిధిలోని ఈ మినీ వాటర్ ట్యాంకుకు మరమ్మత్తులు నిర్వహిస్తే రానున్న వర్షాకాలంలో నీటి కొరత లేకుండా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్‌ట్యాంకు మరమ్మత్తులు నిర్వహించాలని కోరుతున్నారు.

# రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు పూర్తి

## దర్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ మధులత



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ వారి దర్గాను ఆత్మకూరు ఆర్డీవో మధులత మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రొట్టెల పండుగకు దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. యాత్రికులకు సంబంధించిన వాహనాలను పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే దర్గా ఆవరణలో భక్తులకు భారీకేట్లు, తాగునీటి సౌకర్యం తదితర వసతులను కల్పించాలని పేర్కొన్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ ప్రసాద్ రెడ్డి, దర్గా ఈవో మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు. అలాగే దర్గా ఈవో షేక్ మహమ్మద్ హుస్సేన్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. నెల్లూరులోని బారాషాహిద్ రొట్టెల పండుగకు వచ్చి అక్కడ నుండి ఏఎస్‌పేటలోని శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ వారి దర్గాకు వచ్చే భక్తుల కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈనెల 11వ తేదీన ఆత్మకూరు ఆర్డీవో మధులత ఆధ్వర్యంలో జరిగిన అన్ని శాఖల అధికారులకు తెలిపిన సూచనల మేరకు.. తమకు ఇచ్చిన సూచనల ప్రకారం ఇప్పటికే దర్గాలో భక్తులు తోపులాట లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే షామియానాలు, ప్రత్యేక షెల్టర్లు, ఉచితంగా చల్లటి తాగునీరు, అన్నదానం కార్యక్రమం తదితర ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. బుధవారం నుండి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని వారికి అవసరమైన వసతులను సమకూరుస్తామన్నారు. దర్గాలో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకునే భక్తులు తమ కార్యాలయం వద్ద సంప్రదించాలన్నారు. ఆర్డీవో ఆదేశాల మేరకు తహసిల్దార్, ఎంపీడీవో, మెడికల్, పోలీస్ అధికారులు ఇప్పటికే వారి వారి సిబ్బందిని దర్గాలో డ్యూటీల కోసం ఏర్పాటు చేశారన్నారు.

అన్ని శాఖల అధికారులు ఈవోతో సమన్వయమై ఏర్పాట్లు చూసుకోవాలని ఆర్డీవో ఆదేశించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ ఆదేశాల మేరకు గతంలోలాగే ఈసారి కూడా మెరుగైన వసతులు సమకూర్చినట్లు ఈవో తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో దర్శనాలు చేసుకొని, క్షేమంగా తమ స్వస్థలాలకు తిరుగు పయనం కావాలని ఆయన భక్తులను, యాత్రికులను కోరారు. ఐదు రోజులపాటు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

# చిన్నారులను అభినందించిన ఏఎస్ఐ శ్రీనివాసులు



**కావలి, మేజర్‌న్యూస్ :** హైదరాబాద్ నగరంలో మనం ఫౌండేషన్ వారు రెండు నెలల క్రితం సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపకులు వారి కుమార్తె నాట్య గురువు గంగపట్నం లిఖితకు పద్మ ప్రతిభ అవార్డు అందుకున్నారు. అదేవిధంగా పట్నం లిఖిత శిష్యులు ప్రదర్శించిన శ్రీనివాస కళ్యాణ నృత్య రూపం ఎందరినో అలరింపజేసింది. ఎందరో మనలో పొంది కావలికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చినందుకు మంగళవారం ఇంజమూరు ఏఎస్ఐగా నిధులు నిర్వహిస్తున్న ఓ.శ్రీనివాసులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో సురేంద్రను, నాట్య గురువు గంగపట్నం లిఖితను ఘనంగా సన్మానించారు. అనంతరం నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు అభినందనలు తెలిపి అందరికీ స్వీట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సం యుక్త సేవాసంస్థ నాయకులు నృత్యం చేసిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రొట్టెల పండుగకు.. 2 వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

*(మొదటి పేజీ తరువాయి)*



ప్రధానమైన గంధ మహోత్సవం నాడు మరింత పటిష్టంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. దర్గా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ లలో ఉండే రద్దీకి తగ్గట్లుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దర్గా పరిసర ప్రాంతాలు డ్రోన్, 52 సిసి కెమెరాల నిఘా నీడలో 24 గంటలపాటు కంట్రోల్ రూం అందుబాటులో ఉంటుందన్నారు. అదేవిధంగా భక్తులు కూడా అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే పోలీస్ కంట్రోల్ రూమ్కు సమాచారం అందించాలన్నారు. రొట్టెల పండుగలో వాహనాల పార్కింగ్ అనేది కీలకం. బయట నుండి వచ్చే వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే ఉంచా లన్నారు. ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్, 25 పార్కింగ్ ప్రదేశాలు, 12 మేజర్, 13 మైనర్ పార్కింగ్ ప్రదేశాలను, మొబైల్ పార్టీలు-17, 75 సాధారణ ట్రాఫిక్ రెగులేషన్ పాయింట్ లను గుర్తించడం జరిగిందన్నారు. సెక్టార్ ఇంచార్జి ఆఫీసర్‌లు షిఫ్ట్‌లకు అతీతం గా సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించి విధులలో నిమగ్నం చేయాలని, అదేవి ధంగా విధులు అనంతరం కూడా సెక్టార్ సిబ్బంది అందరికీ డీ-బ్రీఫింగ్ నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. అందరూ మాన్ పాక్స్, పబ్లిక్ అడ్రెస్స్ సిస్టంను విరివిగా ఉపయోగించి కమ్యునికేషన్ గ్యాప్ లేకుండా చూసుకోవాలన్నారు. అందరూ సమయపాలన పాటిస్తూ, ప్రతి ఒక్కరు ఐడి కార్డు, విజిల్, రైన్ కోట్, డ్యూటీ పాస్ పోర్ట్‌లతో ఎవరికి నిర్ణయించిన ప్రదేశాలల్లో వారు తప్పక హాజరుగా వుండాలన్నారు. ఎవరైనా అలసత్వం ప్రదర్శించిన, గైర్హాజరు అయినట్లయితే తప్పకుండా శాఖా పరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది మానవతాదృక్పదంతో వ్యహరించి విధులు నిర్వహించాలన్నారు. బోటింగ్ పాయింట్‌లలో కెపాసిటీకి మించి, లైఫ్ జాకెట్‌లు లేకుండా యాత్రికులు బోటు షికారు చేయకుండా చూడాలన్నారు. ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్త్ విజయవంతం చేయాలన్నారు. సెంట్రల్ క్రైం స్టేషన్ అధికారులు, సిబ్బంది ఈ ఉత్సవాలలో జరిగే దొంగతనాలు, నేరాలను అరికట్టే క్రమంలో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో యాంటీ సబోటేజ్ చెకింగ్, ఓఆర్పీలచే తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. బందోబస్త్ పోలీసు సిబ్బంది, అధికారులకు అనుకూలంగా ఉండేలా తగిన వసతితో పాటు భోజనాల ఏర్పాట్లు చేశారు. అనంతరం దర్గా లోపల, చుట్టుప్రక్కల పరిసరా లను సందర్శించి అధికారులకుఎస్పీ కృష్ణ కాంత్ తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# దక్షిణాయాణంలో తొలి పండుగ ఏకాదశి

## జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** దక్షిణాయాణంలో తొలి పండుగ ఏకాదశి అని జ్యోతిష శిరోమణి డాక్టర్ జివిబి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు. అనురాధ నక్షత్రం తొలిఏకాదశి కలయిక విశేషమని తెలియజేశారు. బుధవారం ఆషాడ శుద్ధ ఏకాదశి అని, దీనినే తొలి ఏకాదశి అని కూడా చెప్పుకోవచ్చు. ఆ రోజు రాత్రి 9.02 నిమిషాల వరకు ఏకాదశి ఉందని ఆయన పేర్కొన్నారు. విష్ణుమూర్తి క్షీరాబ్దిలో శయనించే రోజు హిందువులకు దక్షిణాయాణంలో తొలి పండుగని జ్యోతిష శిరోమణి తెలిపారు. ఉదయం 9.06 నిమిషాల నుండి 9.46 నిమిషాల మధ్య పూజ శ్రేయస్కరమన్నారు. వినాయక, విష్ణు, లక్ష్మీ పూజలు చేసుకుంటే శుభం కలుగుతుందని తెలిపారు. కులదేవతల పూజలు చేసుకోవచ్చున్నారు. ఇంటి గడపకు పూజలు చేసి నైవేద్యంగా పెరుగు అన్నం, పండ్లు నివేదించాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 9949919830 ఫోన్ చేయాలన్నారు.

# కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

## టీడీపీ కన్వీనర్ పులుగుంట మధుమోహన్ రెడ్డి

**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండలంలోని 17 పంచాయతీల ప్రజలలో కౌలు రైతులను గుర్తించి అర్హులైన వారికి వెంటనే గుర్తింపు కార్డులు అందజేయాలని జలదంకి తహసీల్దార్ ఎన్.వాసుని మండల టీడీపీ కన్వీనర్ పులుగుంట మధుమోహన్ రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ టీడీపి రైతు అధ్యక్షులు పునూరు భాస్కర్ రెడ్డిలు కోరారు. మంగళవారం జలదంకిలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎన్.వాసుని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కౌలు రైతులకు మంచి రోజులు రానున్నాయని, రుణ అర్హత కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఆ దిశగా రెవెన్యూ, వ్యవసాయ శాఖలకు రాష్ట్ర ప్రభుత్వం దిశా నిర్ధేశం చేసిందన్నారు. క్షేత్రస్థాయిలో కౌలు రైతులను గుర్తించి రుణ అర్హత కార్డులు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు సాయం చేస్తామని స్పష్టం చేసిందన్నారు. రుణ అర్హత కార్డులు ద్వారా కౌలు రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి ప్రతి గ్రూపుకు రుణాలు మంజూరు చేస్తారని, వ్యవసాయ యాంత్రిక పనిముట్లు సబ్సిడీతో అందిస్తారన్నారు. టీడీపీ ప్రభుత్వం గతంలోను ఇలాంటి విధానాన్ని అనుసరించిందని గుర్తు చేశారు. కౌలు రైతులకు గ్రూపులుగా రుణాలు ఇవ్వడంలో లక్ష్యాలను నిర్ధేశించిందన్నారు. ఫలితంగా సాగు కోసం పెట్టుబడికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వచ్చేవని ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే బీమా సౌకర్యం వర్తించేదని తెలిపారు. ఇన్ని విధాలుగా లాభదాయకమైన రుణ అర్హత కార్డులును వైసీపీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదన్నారు. రుణాలు ఇవ్వలేదని, కౌలు వ్యవస్థను పూర్తిగా దెబ్బతీసిందన్నారు. కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు చేయూతనిచ్చే దిశగా అడుగులు వేస్తున్నదన్నారు. కౌలు రైతులకు గత వైసీపీ ప్రభుత్వం చేయూత నిలిపిందని, గ్రూపు రుణాలు లేవు యాంత్రిక పనిముట్లు సబ్సిడీ ఇటు రైతులకు, అటూ కౌలు రైతులకు ఆపేసిందన్నారు. గడిచిన ఐదేళ్లలో కౌలు రైతులు సాగుకు దూరం అవుతూ వచ్చారని సాగు చేసిన కౌలు రైతుకు ప్రకృతి వైపరీత్యాలు వలన కలిగిన పంట నష్టానికి పరిహారం రాలేదన్నారు. దీంతో కౌలు రైతులకు అప్పుల మిగిలాయని చివరికి కౌలు రైతులు సాగుకు ముందుకు రాక పోవడంతో కౌలు పడిపోయిందన్నారు.

# మహిళకు విష జ్వరం.. నిర్ధారించిన వైద్య ఆరోగ్యశాఖ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రం ముత్తుకూరులో ఓ మహిళకు డెంగ్యూ జ్వరం సోకింది. ఈ నేపథ్యంలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ బృందం అప్రమత్తమైంది. విష జ్వరం సోకిన మాట వాస్తవమేనని వైద్య ఆరోగ్యశాఖ తెలియజేసింది. కోనేటి మిట్ట ప్రాంతంలో ఆ శాఖ అధికారులు విష జ్వరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వచ్చేటువంటి విషజ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. అదేవిధంగా పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది దోమలు నివారణకు స్ప్రే చేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారిని డాక్టర్ దేవి కృప, సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ కృష్ణంరాజు, పిహెచ్ఎన్ వేలాంగని, ఆరోగ్య సహాయకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు





- ఘనంగా రొట్టెల పండగ నిర్వహణ
- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రొట్టెల పండుగకు విచ్చేసే భక్తుల భద్రత, పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సేథు మాధవన్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రొట్టెల పండుగ ఏర్పాట్ల గురించి బారా షాహిద్ దర్గా ప్రాంతంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో వివిధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. లక్షలాదిమంది తరలివచ్చే రొట్టెల పండుగలో పరిశుభ్రతకు పెద్ద పీట వేసామన్నారు. బారా షాహిద్ దర్గా ప్రాంతాన్ని వివిధ జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌కు అధికారులను నియమించి ఎప్పటికప్పుడు భక్తులకు అవసరమైన త్రాగునీటి వసతిని, పరిసరాల పరిశుభ్రతను పర్యవేక్షిస్తామన్నారు. స్వర్ణాల చెరువులోని నీటిని పరిశుభ్రంగా ఉంచామన్నారు. అదేవిధంగా ఘాట్ పరిసర ప్రాంతాల్లో భక్తుల రద్దీకనుగుణంగా ఎప్పటికప్పుడు శుభ్ర పరచడానికి అగ్నిమాపక శకటాన్ని సిద్ధంగా ఉంచామన్నారు. దర్గా ప్రాంతంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌లలో వ్యాపారులు తయారు చేసే ఆహార పదార్థాలు శుచిగా ఉండేట్లుగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా నెల్లూరు నగరంలోని 14 పార్కింగ్ ఏరియాల్లో త్రాగునీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. దర్గా పరిసర ప్రాంతాల్లోనే కాకుండా నెల్లూరు నగరాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. రొట్టెల పండుగకు వచ్చే భక్తులు క్షేమంగా వచ్చి, తిరిగి క్షేమంగా వెళ్లేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఖాదర్ బాషా, నెల్లూరు మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శర్మద, ఆర్‌డిఓ మాలోల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేటి నుంచి రొట్టెల పండగ

- లక్షలాది మంది భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు
- 18న గంధ మహెూత్సవం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రొట్టెల పండగ బుధవారం నుంచి జిల్లాలో ప్రారంభం కానుంది. ఈసారి రొట్టెల పండగకు లక్షలాదిమంది భక్తులు విచ్చేయనున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. రొట్టెల పండగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. అలాగే పోలీసు యంత్రాంగం ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడకుండా తగిన ముందస్తు చర్యలను తీసుకున్నారు. బారాసాహి దర్గా వద్ద గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మౌలిక వసతులను పెద్ద ఎత్తున కల్పించారు. మరుగుదొడ్లు, తాగునీరు, వాహనాల పార్కింగ్, ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత అన్నదాన




కేంద్రాలను ఏర్పాటు చేశారు. నెల్లూరు బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ 70 మందికి ఈ ఏడాది అవకాశం కల్పించారు. వేలాదిమంది భక్తులు మొదటి రోజు వచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేకంగా భారీకేడ్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ వెలుగుల్లో బారాషాహీద్ దర్గా వెలిగిపోతోంది. ఐదు రోజుల పాటు రొట్టెల పండగ సాగనుంది.

# కుష్టు వ్యాధిపై అవగాహన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** కుష్టు వ్యాధి పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ వినీత తెలిపారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య సహాయకులు, ఏఎన్‌ఎంలు, ఆశాలతో ఎల్సిడిసి సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పూర్వజన్మ కర్మ ఫలం వల్ల రాదని ఇక కేవలం మైక్రో బ్యాక్టీరియా లెప్రై అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుందన్నారు. శరీరంపై రాగి రంగు, స్పర్శలేని మచ్చలు, ముఖము నిగనిగలాడుతూ ఉండటం, సత్తి ముక్కు, కనుబొమ్మలవెంట్రుకలు రాలుట, స్పర్శ తెలియకపోవడం, చేతులు కాళ్ళు తిమ్మిర్లు ఎక్కువగా ఉండడం మొదలగు లక్షణాలు కనిపించిన వెంటనే ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు తెలియజేయాలని సూచించారు. పై లక్షణాలు శరీరంలో ఉన్నచో ఆలస్యం చేయకుండా ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స తీసుకోవాలన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రతి ఇంటిని ఆరోగ్యశాఖ సిబ్బంది సందర్శించాలని కోరారు. ఆశా కార్యకర్తలు స్త్రీలని, మగ వాలంటీర్లు పురుషులని పరీక్షించి మచ్చలు గల వారి పేర్లు నమోదు చేసుకొని పరీక్షల నిమిత్తం సంబంధిత వైద్యాధికారి వద్దకు పంపాలన్నారు. సర్వేలో ప్రతి ఇంటికి తప్పని సరిగా నెంబర్ వేయాలన్నారు. ప్రజలకు కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. "చేతులు కలపండి- కుష్టు వ్యాధి నిర్మూలించండి "అనే విధంగా నినాదాలు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో విధులు నిర్వహించే ప్రతి ఆశా కార్యకర్త, మగ వాలంటీర్లు ప్రతిరోజు 15 నుంచి 25 గృహాలను సర్వే నిర్వహించి మచ్చలు గల వారిని గుర్తించి సమగ్ర నివేదికను ఏఎన్‌ఎం లకు అందజేయాలన్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా రిపోర్ట్ ఇవ్వాలని కోరారు. ఏఎన్‌ఎంలు ఎల్సిడిసి ఇంటింటి సర్వేను ప్రతిరోజు పరిశీలించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు వై చెన్నయ్య, టి అంకమ్మ, ఆరోగ్య సహాయకులు హసానయ్య, రబ్బాని, శ్రీనివాసులు, చంద్రమౌళి, మన్సూర్ అలీ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ పల్లి పీర్ల చావడి వద్ద అన్నదానం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో మొహరం పండుగ సందర్భంగా ఆత్మకూరు పట్టణ 3వ వార్డులోని లక్ష్మణరావుపల్లిలో ఉన్న పీర్ల చావడి వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పీర్ల పండుగ ప్రారంభమైన రెండవ రోజు ఇక్కడ అన్నదానం చేయడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఇదే క్రమంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గౌస్ బాషా పాల్గొన్నారు. పట్టణ ప్రజలతో పాటు సమీప గ్రామ ప్రజలు కూడా అన్నదానంలో పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనకారులు హెల్మెట్లు ధరించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ద్విచక్ర వాహన కారులు తప్పకుండా హెల్మెట్లు ధరించి ప్రయాణం చేయాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంఘం చైర్మన్ బి.రాజేష్ సూచించారు. మంగళవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో న్యాయ సేవా అధికార సంఘం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రీమ్ కోర్టు ఆదేశాల మేరకు సురక్షిత ప్రయాణం జరిగేలా ద్విచక్ర వాహనకారులు తప్పకుండా హెల్మెట్లు ధరించాలన్నారు. ప్రమాధాల్లో ఎక్కువ మంది హెల్మెట్లు లేకనే మృతి చెందారని రాజేష్ పేర్కొన్నారు. కాబట్టి అందరూ అవగాన పెంచుకోవాలని, హెల్మెట్లు వినియోగించుకోవాలని న్యాయమూర్తి కోరారు. ఈ సదస్సులో సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ నాయుడు, సబ్ జైలు సూపర్నెంట్ విజయకుమార్, ప్రజలు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంటి పరిశీలించిన నాయకులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ వాటర్ ప్లాంట్ ను మంగళవారం ఆత్మకూర్ మున్సిపల్ చైర్మన్ గోపవరం వెంకటరమణమ్మ, పట్టణ టిడిపి అధ్యక్షులు చంద్ర రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ సర్దార్ తదితరులు పరిశీలించారు. అక్కడ నీటి లభ్యత, శుద్ధి, సరఫరా గురించి సిబ్బందితో చర్చించారు. ఆత్మకూరు ప్రజలకు ప్రతిరోజూ తాగు నీరు సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఫాజులుల్లా, ఏ ఇ వరలక్ష్మి,వార్డు కౌన్సిలర్లు 20 వార్డ్ సురా భాస్కర్ రెడ్డి, 3వ వార్డు కౌన్సిలర్ షేక్ గౌస్ బాషా, 22వ వార్డు కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులు నాయుడు, 18 వార్డ్ కౌన్సిలర్ గందల్ల వేణు మరియు టిడిపి నాయకులు గొట్టి గుండాల బుజ్జి రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, తోడేటి వెంకటయ్య, 9వ వార్డు నాయకులు చిన్నపరెడ్డి, పొట్టి పోగు సాగర్, 17వ వార్డ్ మాజీ కౌన్సిలర్ ఖాదర్ భాషా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రొట్టెల పండుగకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఐదు రోజులపాటు రొట్టెల పండుగ
- కోర్కెల రొట్టెల కోసం దేశ విదేశాల నుంచి కదిలి వస్తున్న భక్తజనం
- భక్తులతో కళకళలాడుతున్న దర్గా ప్రాంగణం
- 18న గంధ మహోత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా యంత్రాంగం
- భక్తులకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు
- విరివిగా మరుగుదొడ్లు ఏర్పాటు
- 5వేల మందికి పైగా సిబ్బందితో పరిశుభ్రతకు పెద్దపీట
- 7 జోన్లుగా దర్గా ప్రాంగణంలో పారిశుధ్య పనులు
- 2వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
- స్వర్ణాల చెరువులో గజఈతగాళ్లు, బోట్లతో గస్తీ
- 52 సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా
- 12 మేజర్, 13 మైనర్ పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు
- ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మతసామరస్యానికి ప్రతీకగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన నెల్లూరు నగరం లోని బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు సర్వం సిద్ధమైంది. కోర్కెల రొట్టెల కోసం దేశ విదేశాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. భక్తజన కోర్కెల తరంగాలతో స్వర్ణాల చెరువు సరికొత్త శోభను సంతరించుకుంది. నేటి నుంచి ఈనెల 21 వరకు ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా పండుగను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. దేశ విదేశాల నుంచి భక్తజనం తరలి రావడంతో దర్గా ప్రాంగణం భక్తులతో కళకళలాడు తుంది. ఈనెల 17వ తేదీ సంధల్ మాల్, 18న గంధ మహోత్సవం, 19న రొట్టెల పండుగ, 20న తలిఫా తేహ, 21న ముగింపు సభతో రొట్టెల పండగ ముగియనుంది. రొట్టెల పండుగకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

పారిశుధ్య నిర్వహణకు సుమారు 5వేల మందికి పైగా సిబ్బందిని మున్సిపల్ అధికారులు నియమించారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి సూపర్వైజర్లను నియమించి పారిశుధ్య పనులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. 12 తాగునీటి స్టాల్స్ ఏర్పాటుచేసి నిరంతరం భక్తులకు స్వచ్ఛమైన నీటిని అందించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ఆధ్వర్యంలో 2వేల మందితో పటిష్ట పోలీసు బందోబస్తు, 52 సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఘాట్ల వద్ద నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు అగ్నిమాపపశాఖ ద్వారా 10 పంపుల ద్వారా వాటర్‌ను పంపింగ్ చేసేలా సిబ్బందిని నియమించారు. నాలుగు అగ్నిమాపక వాహనాలను కూడా దర్గా ప్రాంగణంలో అందుబాటులో ఉంచారు. 36మంది గతఈతగాళ్లు, రెండు బోట్లలో గస్తీ ఏర్పాటు చేసినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. కసుమూరు, ఏఎస్‌పేట దర్గాలకు నిరంతరం బస్సులను నడపనున్నారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ స్టాల్స్, 57రకాల మందులు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. విద్యుత్‌సరఫరాకు అంతరాయం లేకుండా, ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు విద్యుత్‌శాఖ అధికారులు చేపట్టారు. 12 మేజర్, 13 మైనర్ పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటుచేసి మరుగుదొడ్లు, తాగునీరు వసతి కల్పించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. రొట్టెల పండగ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తున్నారు.









